క్లుప్తంగా

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి


సూర్యాపేటలో విద్యార్థులకు డిక్షనరీలు అందిస్తున్న సంఘం నాయకులు

సూర్యాపేట : దాతలు అందించిన డిక్షనరీలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్.సీతారామయ్య అన్నారు. శుక్రవారం సూర్యాపేట పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రిటైర్డ్ ఉపాధ్యాయురాలు అరుణకుమారి అందించిన ఇంగ్లిష్ టు తెలుగు డిక్షనరీలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఆంగ్లభాష ఆవశ్యకతను తెలుపుతూ విద్యార్థుల కోసం డిక్షనరీలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి, పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.సుదర్శన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి బి.రాంబాబు, నాయకులు వి.శ్రీనివాసరావు, నర్సయ్య, మండల అధ్యక్ష, కార్యదర్శులు దండా శ్యాంసుందర్‌రెడ్డి, సుదగాని నాగేశ్వర్‌రావు, వి.రాములు, కె.సురేందర్‌రెడ్డి, లింగమూర్తి పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదె మృతి

చివ్వెంల : ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి పాడి గేదె మృతి చెందింది. ఈ సంఘటన మండల పరిధిలోని బీబీగూడెం గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ధరావతు హర్యా తన పశువులను మేత కోసం వ్యవసాయ బావి వద్దకు తోలుకెళ్లాడు. పశువులు మేత మేసుకుంటూ తిరుగుతుండగా, అక్కడే కిందకు వేలాడుతున్న విద్యుత్ వైర్లు ఓ పాడి గేదెకు తగిలాయి. దీంతో గేదె మృతిచెందింది. చనిపోయిన గేదె విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు. విద్యుత్ అధికారులు స్పందించి నష్ట పరిహారం అందించాలని కోరారు.

అనుమతి లేకుండా నిర్మాణాలు చేపట్టవద్దు

సూర్యాపేట : మున్సిపల్ నిబంధనలకు విరుద్ధంగా, అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేసిన వారికి జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ సూర్యాపేట జిల్లా వారు జరిమానా విధించినట్లు మున్సిపల్ కమిషనర్ పి.రామానుజుల రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. సూర్యాపేట మున్సిపాలిటీలో నిబంధనలకు విరుద్ధంగా అదనంగా నిర్మాణాలు, అనుమతి లేకుండా భవనాలు నిర్మించిన 26 మందిపై కోర్టులో కేసు వేయగా ముగ్గురు గృహ యజమానులపై జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ సెకండ్ క్లాస్ వారు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. పట్టణ ప్రజలు మున్సిపాలిటీ నిబంధనల మేరకే గృహాల నిర్మాణాలు చేపట్టాలని అన్నారు.

12న ప్రార్థన దినం


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

అర్వపల్లి : భారతదేశం, తెలంగాణ రాష్ట్ర అభివృద్ధిని ఆకాంక్షిస్తూ హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ నెల 12న నిర్వహించే ప్రార్థన దినంను జయప్రదం చేయాలని పాస్టర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు దుర్గం ప్రభాకర్ కోరారు. శుక్రవారం అర్వపల్లిలో ప్రార్థన దినోత్సవ కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. క్రిస్టియన్ కౌన్సిల్ ఆఫ్ తెలంగాణ, తెలంగాణ క్రిస్టియన్ ఎంఎల్‌సీ రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో ప్రార్థన దినాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాస్టర్స్ అసోసియేషన్ నాయకులు ఏలియారాజు, చింత మనిషే, బోయాజ్, మత్తయి, ప్రభాకర్, కిరణ్‌కుమార్, బోడ లూక, రూబెన్, క్రాంతికుమార్, దానయ్య, హోసన్న, మార్క్ పాల్గొన్నారు.

పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం


చివ్వెంల స్కూల్‌లో వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులతో విద్యార్థులు

మద్దిరాల : చిననెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు శుక్రవారం వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గౌతమి రాజు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. మద్దిరాల మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుతుబుద్దీన్ కుమారుడు నసీరుద్దీన్ బాబా విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లు, స్కేళ్లు బహూకరించారు. ఈ కార్యక్రమంలో హెడ్ మాస్టర్ శివయ్య, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వెంకన్న, ఉపాధ్యాయులు శ్రీనివాస్, హర్షున్, ఉపేందర్ రెడ్డి, యాకయ్య, సాల్మన్, ప్రదీప్ కుమార్, మధు, ఉపేందర్, అవిలయ్య, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

అందని ఈ-పంచాయతీ సేవలు

- గ్రామాల్లో నెట్ సౌకర్యం లేక ప్రారంభం కాని ఆన్‌లైన్ సేవలు
- నిరుపయోగంగా మారిన కంప్యూటర్లు
- ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్తున్న ప్రజలు


సంగెంలోని గ్రామపంచాయతీ కార్యాలయం

తుంగతుర్తి : గ్రామీణ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతమైన పాలన అందించడం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ-పంచాయతీ సేవలను 2016లో అందుబాటులోకి తెచ్చింది. గ్రామాల్లోని ప్రజలు ప్రతి పనికి మండల కేంద్రానికి వెళ్లకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ-పంచాయతీ విధానాన్ని తీసుకొచ్చింది. ఈ కార్యాలయాల్లో ప్రజలకు కుల, ఆదాయ, జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు అందించాల్సి ఉంది. అలాగే జీపీకి వచ్చే ఆదాయ, వ్యయాలు, ఇంటి నిర్మాణ అనుమతులు, ఇంటి పన్నులు, నల్లా పన్ను వసూళ్లు ఆయా గ్రామాల్లోనే ఆన్‌లైన్ ద్వారా చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. కానీ ఇప్పటి వరకు ఆ దిశగా ప్రజలకు సేవలు అందడం లేదు.

వచ్చిన కంప్యూటర్లు వెనక్కి..

మండలంలో 24 గ్రామపంచాయతీ ఉన్నాయి. వీటిలో పాత జీపీలు 12, నూతనంగా ఏర్పాటైన జీపీలు 12 ఉన్నాయి. పాత జీపీలకు ప్రభుత్వం ఈ-పంచాయతీ సేవలు అందించేందుకు 10 కంప్యూటర్లను అందజేసింది. కానీ ఆయా గ్రామాల్లో ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో కంప్యూటర్లు నిరుపయోగంగా మారాయి. దీంతో నాలుగు కంప్యూటర్లను ఎంపీడీఓ కార్యాలయానికి, రెండు కంప్యూటర్లను డీపీఓ కార్యాలయానికి తీసుకెళ్లారు. మిగతా నాలుగు తుంగతుర్తి, కొత్తగూడెం, గొట్టిపర్తి, బండరామారం గ్రామాల్లోని జీపీల్లో నిరుపయోగంగా ఉన్నాయి. ఇంటర్నెట్ సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తమ పనుల కోసం మండల కేంద్రాన్ని ఆశ్రయిస్తున్నారు. మండలంలోని జీపీలకు ఫైబర్ నెట్‌వర్క్ కేబుల్‌ను ఏర్పాటు చేశారు. కానీ సేవలు ప్రారంభం కాలేదు. గ్రామాల్లో ఈ-పంచాయతీ సేవలను అందుబాటులో తెచ్చి ప్రజలకు ఆన్‌లైన్ సేవలు అందించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఆన్‌లైన్ సేవలు అందేలా చూస్తాం



గ్రామ పంచాయతీల్లో ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తెస్తాం. ఇప్పటి వరకు మండల కేంద్రం నుంచే ఈ-పంచాయతీ సేవలు అందిస్తున్నాం. అన్ని జీపీలలో కంప్యూటర్లు ఏర్పాటు చేయడం కోసం ప్రభుత్వానికి నివేదిక పంపాము. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే గ్రామాల్లో ఆన్‌లైన్ సేవలు అందిస్తాం.

– భీంసింగ్, ఎంపీడీఓ, తుంగతుర్తి

కాంగ్రెస్ పాలనలోనే రైతురాజ్యం సాధ్యం


పాట్లపహాడ్‌లో పటేల్ రమేష్‌రెడ్డికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు

పెన్‌పహాడ్: రైతు రాజ్యం రావాలంటే కాంగ్రెస్ పాలనలోనే సాధ్యమవుతుందని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని పొట్లపహాడ్, నాగులపాటి అన్నారం గ్రామాల్లో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ మహాపాదయాత్రలో ఆయన పాల్గొని మాట్లాడారు. మోదీ అవినీతిని ప్రశ్నించిన రాహుల్ గాంధీని వేధింపులకు గురి చేస్తూ పార్లమెంట్‌లో అడుగుపెట్టకుండా కుట్ర పన్నారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పెట్రోల్, గ్యాస్, డీజిల్ ధరలను విపరీతంగా పెంచి పేదలను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తోందని తెలిపారు. సామాన్య ప్రజలపై పన్నులు, నిత్యావసర ధరల రూపంలో భారం మోపుతోందన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో రూ.400లు ఉన్న వంట గ్యాస్ సిలిండర్‌ను రూ.1250లకు పెంచారని అన్నారు. పేద ప్రజల సంక్షేమానికి కట్టుబడి తన పరిపాలన సాగించే కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతుగా నిలబడాల్సిన అవసరం ఉందని తెలిపారు. బీఆర్‌ఎస్ మాయమాటలను నమ్మేస్థితిలో ప్రజలు లేరని పేర్కొన్నారు. అవినీతి బీఆర్‌ఎస్‌ను గ్రామాల నుంచి తరిమినప్పుడే మన బ్రతుకులు బాగుపడతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో బచ్చుపల్లి నాగేశ్వర్‌రావు, కుందూరు వెంకట్‌రెడ్డి, కొండేటి పవన్, నారాయణ సునీతశ్రీధర్‌రెడ్డి, సామ సురేందర్‌రెడ్డి, మల్గిరెడ్డి సంజీవరెడ్డి, మామిడి శ్రీనివాస్, షకీల్, నాగార్జున, నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న ఎంపీపీ నెమ్మాది భిక్షం

పెన్‌పహాడ్ : అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని దోసపహాడ్, నాగులపహాడ్, అనాజిపురం గ్రామాల్లో బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలే కాకుండా ఇవ్వని హామీలను కూడా నెరవేర్చిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. మండల స్థాయిలో నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు మామిడి అంజయ్య, పీఏసీఎస్ చైర్మన్ నాతాల జానకిరాంరెడ్డి, సర్పంచ్‌లు దొంగరి సుధాకర్, చెన్ను శ్రీనివాస్‌రెడ్డి, రాయిలి లక్ష్మి, మేకల శ్రీను, దంతాల వెంకన్న, జగన్, కొండేటి రాంబాబు, లక్కపాక నర్సయ్య, కొండా జానకిరాములు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ పేదలకు వరం

- బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని


ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న సంకినేని వెంకటేశ్వర్‌రావు

చివ్వెంల : ఆయుష్మాన్ భారత్ పథకం దేశంలో పేద ప్రజలకు వరం అని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన ఆయుష్మాన్ భారత్ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రత్యామ్నాయం బీజేపీనే అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బిట్టు నాగరాజు, ధరావతు రవి, ధరావతు కృష్ణ, కనకయ్య, సైదులు, ఫణి, దాసరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడికి సన్మానం

మద్దిరాల : మద్దిరాల మండల పరిధిలోని పోలుమల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న తెలుగు ఉపాధ్యాయుడు మెంతబోయిన సైదులు ఇటీవల డాక్టరేట్ పొందారు. దీంతో ఆయనను శుక్రవారం ఆ పాఠశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం బత్తుల వెంకటయ్య, ఉపాధ్యాయులు టీ.పూర్ణచారి, సీహెచ్ వెంకన్న, కే.శ్రీలత, కోన వెంకటేశ్వర్లు, డి.అంజలి, సీహెచ్ ప్రవీణ్ కుమార్, గార రాములు, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కంటి వెలుగును సద్వినియోగం చేసుకోవాలి


సంగెంలో కంటివెలుగు శిబిరాన్ని ప్రారంభిస్తున్న డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు

తుంగతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డీసీసీబీ డైరెక్టర్ గుడిపాటి సైదులు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సంగెం గ్రామంలో రెండో విడత కంటి వెలుగు శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి అద్దాలు, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. కంటి వెలుగు శిబిరంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక వసతులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఏశమల్ల సుశీల, ఎంపీటీసీ కలకోట్ల ఎలేజర్, తాటికొండ సీతయ్య, గుండగాని రాములుగౌడ్, దొంగరి శ్రీను, భిక్షంరెడ్డి, వెంకట్‌రెడ్డి, శోభారాణి, నగేష్, రాములు, రమేష్, మల్లేష్, కార్యదర్శి శేఖర్, వైద్యసిబ్బంది, ఏఎన్‌ఎంలు, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



సూర్యాపేట : ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, తదితరులు


తిరుమలగిరిలో ర్యాలీలో పాల్గొన్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్, తదితరులు

సూర్యాపేట : పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ అన్నారు. శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ ఈఈ జీకేడీ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, జనార్దన్‌రెడ్డి, మస్కాపురం సురేష్, శ్వేత, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

తిరుమలగిరి : ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్ అన్నారు. శుక్రవారం స్వచ్ఛ సర్వేక్షన్ ర్యాలీలో పాల్గొని మాట్లాడారు. ప్రతి ఇంటిలో తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు అందించాలని సూచించారు. బహిరంగ మల, మూత్ర విసర్జన చేయరాదని, పబ్లిక్ టాయిలెట్లు ఉపయోగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, మేనేజర్ బుచ్చిబాబు, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, ప్రియలత, అనసూయ, హరిత, సరిత, జూనియర్ అసిస్టెంట్ ఖదీర్, లక్ష్మణ్, శ్రీనివాస్, వెంకన్న, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

పౌర హక్కులను కాపాడుకోవాలి


సూర్యాపేట రూరల్ : మాట్లాడుతున్న ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి


నాగారం : వర్ధమానుకోటలో పౌరహక్కులపై అవగాహన కల్పిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

సూర్యాపేట రూరల్ : పౌర హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఎంపీపీ బీరవోలు రవీందర్‌రెడ్డి, జెడ్పీటీసీ జీడి భిక్షం అన్నారు. శుక్రవారం టేకుమట్ల గ్రామంలో జరిగిన పౌర హక్కుల దినోత్సవ అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామసాని శ్రీనివాస్ నాయుడు, సర్పంచ్ పద్మా నాగేందర్, ఎంపీటీసీ సభ్యులు అలివేలు, కేశవులు, తహసీల్దార్ వెంకన్న, ఎంపీడీఓ శ్రీనివాసరావు, పశు వైద్యాధికారి గోపి, ఏపీఎం వెంకన్న, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రవి, సీడీపీఓ కిరణ్మయి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రాజ్యాంగం కల్పించిన చట్టాలను సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని వర్ధమానుకోట గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు విద్యావంతులుగా ఎదగాలని కోరారు. కుల వివక్ష లేకుండా అందరూ కలసి, మెలసి ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బోయిని శోభ లింగమల్లు, సీనియర్ అసిస్టెంట్ ఉప్పలయ్య, యారాల రాంరెడ్డి, ఆశలు తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని పాత ఎస్సీకాలనీలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ అసిస్టెంట్ జలేందర్‌రావు మాట్లాడారు. పౌరహక్కుల దినోత్సవ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కంట్లమయ్య, కార్యదర్శి బి. నెహ్రూనాయక్, వార్డు సభ్యుడు దాసరి రవీందర్, కె. లక్ష్మీనారాయణ, భిక్షం, శ్రీనివాస్, ప్రభాకర్, వీఆర్‌ఏలు నర్సింగ విజయ్, శోభారాణి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగిస్తే చర్యలు

నూతనకల్ : సమాజంలో పౌర హక్కులకు భంగం కలిగించే వారిపై చర్యలు తప్పవని ఎంపీపీ భూరెడ్డి కళావతిసంజీవరెడ్డి, తహసీల్దార్ ఎండీ జమీరుద్దీన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో కుల, మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తీగల కరుణశ్రీగిరిధర్ రెడ్డి, ఎంపీటీసీ పన్నాల రమామల్లారెడ్డి, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రైతులకు అండగా సహకార సంఘాలు


గోదాము నిర్మాణ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నడిగూడెం : రైతులకు సహకార సంఘాలు అండగా ఉన్నాయని ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్ అన్నారు. శుక్రవారం వల్లాపురంలో నడిగూడెం సహకార సంఘం మహాజన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలు బలోపేతమయ్యాయన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో రూ.35 లక్షల వ్యయంతో చేపట్టిన గోదాము నిర్మాణ పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో సంఘం చైర్మన్ పుట్టా రమేష్, ఎంపీపీ యాతాకుల జ్యోతి, రైతు సమన్వయ సమితి మండల కన్వీనర్ కాసాని వెంకటేశ్వర్లు, పాలక వర్గం సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ


అర్వపల్లి : తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో పరీక్ష సామగ్రి పంపిణీ చేస్తున్న దాత


ఆత్మకూర్ (ఎస్) : పరీక్ష ప్యాడ్‌లు అందజేస్తున్న అక్షర ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు


సూర్యాపేట రూరల్ : విద్యార్థులకు ప్యాడ్లు పంపిణీ చేస్తున్న అక్షర ఫౌండేషన్ సభ్యులు

అర్వపల్లి : సూర్యాపేట సుధాకర్ పీవీసీ సౌజన్యంతో అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల పరిధిలోని తిమ్మాపురం జెడ్పీహెచ్‌ఎస్‌లో 10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. 44మందికి పరీక్ష ప్యాడ్లు, పెన్నులు, పెన్సిళ్లను అక్షర ఫౌండేషన్ అధ్యక్షుడు యాస రాంకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సీహెచ్.రవీందర్, ఉపాధ్యాయులు చాంప్లానాయక్, నర్సయ్య, స్నేహలత, కృష్ణయ్య, కొండ వెంకన్న, ఎస్.వెంకన్న, మాధవి, సీనయ్య, రెహనా, సునంద, మహబూబ్‌అలీ పాల్గొన్నారు.

అర్వపల్లిలోని కేజీబీవీలో..

ప్రతి ఒక్కరూ సేవా దృక్పథం అలవర్చుకోవాలని టీపీసీసీ సీనియర్ నాయకుడు, న్యాయవాది అన్నెపర్తి జ్ఞానసుందర్ కోరారు. శుక్రవారం అర్వపల్లిలోని నాగారం కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయంలో బాలికలకు పరీక్ష ప్యాడ్‌లను పంపిణీ చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని హైస్కూళ్లలో విద్యార్థిని, విద్యార్థులకు ఉచితంగా పరీక్ష సామగ్రిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్‌కే. శిరిన్, చెరుకు విజయ్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలి

ఆత్మకూర్ (ఎస్) : విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు సాధించాలని ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని కందగట్ల, కోటపహడ్, ఆత్మకూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పదవ తరగతి విద్యార్థులకు అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయపడవద్దని అన్నారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా ధైర్యంగా ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని సూచించారు. ఉన్నత లక్ష్యాలను ఎంచుకున్నప్పుడే జీవితంలో స్థిరపడతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గోపిరెడ్డి, శంకర్‌నాయక్, అక్షర ఫౌండేషన్ సభ్యులు బత్తుల దామోదర్‌రెడ్డి, కందాళ వెంకటరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అక్షర ఫౌండేషన్ సేవలు అభినందనీయం

సూర్యాపేట రూరల్ : అక్షర ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం టేకుమట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ సభ్యులు ఉప్పు నాగయ్య, ఉపాధ్యాయులు రామలింగారెడ్డి, పీఈటీ మల్లేష్, పద్మలీల, శోభాబాయ్, జయమ్మ, అన్నపూర్ణ, అరుందతి, ఉపేందర్, రెడ్యానాయక్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిరాల : మండల పరిధిలోని గోరంట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు అన్నెపర్తి జ్ఞానసుందర్ అందించిన పరీక్ష ప్యాడ్లను శుక్రవారం కాంగ్రెస్ కార్యకర్తలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు చిలక శ్రీనివాస్, కాంగ్రెస్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి సురేష్, గ్రామ శాఖ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సీఆర్పీ నవీన్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సహకారాలను సద్వినియోగం చేసుకోవాలి

నూతనకల్ : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల కోసం దాతలు అందిస్తున్న సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయుడు వెంకన్న అన్నారు. శుక్రవారం వెంకేపల్లి గ్రామంలోని కట్టభద్రమ్మ రాజిరెడ్డి మెమోరియల్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు అక్షర ఫౌండేషన్ సహకారంతో పరీక్ష సామగ్రిని అందజేశారు. ఈ కార్యక్రమంలో అక్షర ఫౌండేషన్ సభ్యులు పాల్వాయి వెంకన్న, లక్ష్మణ్, పరశురాములు, గంగరాజు, వెంకన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మద్దిరాల : గోరంట్ల ప్రభుత్వ పాఠశాలలో పరీక్ష ప్యాడ్లు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు


అర్వపల్లిలోని కేజీబీవీలో పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న జ్ఞానసుందర్


నూతనకల్ : విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేస్తున్న అక్షర ఫౌండేషన్ సభ్యులు

బీజేపీ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయం


మాట్లాడుతున్న మట్టిపెల్లి సైదులు

పెన్‌పహాడ్ : ప్రజా వ్యతిరేక విధానాలు అనుసరిస్తున్న బీజేపీ ప్రభుత్వం గద్దె దిగడం ఖాయమని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టిపెల్లి సైదులు అన్నారు. సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న జీపు ప్రచార జాతా శుక్రవారం మండలానికి చేరుకుంది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానాన్ని కూడా నిలబెట్టుకోలేకపోయిందని అన్నారు. ప్రభుత్వాన్ని నిలదీయడం కోసం ఈ నెల 5న ఢిల్లీలో చేపట్టే నిరసన కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజా వెంకటేశ్వర్లు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ధనియాకుల శ్రీనివాస్, నకిరేకంటి నర్సయ్య, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

తూములు ధ్వంసం చేస్తే చర్యలు

మద్దిరాల : చెరువుల తూములు ధ్వంసం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ అమీన్‌సింగ్ అన్నారు. మండల కేంద్రానికి చెందిన పెద్ద చెరువు తూములను శుక్రవారం చేపలు పట్టుకోవడం గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు తూములను పరిశీలించినట్లు ఆయన తెలిపారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

తిరుమలగిరి : ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని గుండెపురి ఎంపీటీసీ సభ్యుడు జమ్మిలాల్ కోరారు. శుక్రవారం గుండెపురి గ్రామంలో పోషణ్ పక్వాడ్ వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పాక రేణుక, సూపర్‌వైజర్ ఖైరున్నీసాబేగం, ఉప సర్పంచ్ జానకిరాములు, బాలకృష్ణ, ఝాన్సీ, యాకూబ్, సుందర్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి పరామర్శ

పెన్‌పహాడ్ : నారాయణగూడెం గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు చిట్యాల సైదులు ఇటీవల మృతి చెందాడు. దీంతో శుక్రవారం మృతుడి కుటుంబాన్ని మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు తూముల సురేష్‌రావు, మహిళా అధ్యక్షురాలు అనురాధ, మాజీ ఎంపీపీ మండలి జ్యోతిపిచ్చయ్య, నారాయణ, ప్రవీణ్‌రెడ్డి, గజ్జెల సైదిరెడ్డి, సుధీర్, అర్తి కేశవులు, పరశురాములు, రాంబాబు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి దామోదర్‌రెడ్డి

సంక్షిప్తంగా..

చలివేంద్రం ప్రారంభం


తిరుమలగిరిలో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్

తిరుమలగిరి : ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలు ఉపయోగపడతాయని తిరుమలగిరి మున్సిపల్ చైర్‌పర్సన్ పోతరాజు రజనీరాజశేఖర్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరిలోని చౌరస్తాలో చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ దండు శ్రీనివాస్, మేనేజర్ బుచ్చిబాబు, కౌన్సిలర్లు బత్తుల శ్రీను, అనసూయ, సరిత, ప్రియలత, ఖదీర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నాగారం : డి.కొత్తపల్లి గ్రామానికి చెందిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు అనంతోజు ఉపేంద్రచారి గురువారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా ఆరాధ్య ఫౌండేషన్ చైర్మన్ తాడోజు వాణిశ్రీకాంత్‌రాజ్ శుక్రవారం మృతుడి భౌతికకాయాన్ని సందర్శించి, మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో ఆరాధ్య ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ముక్కుడు దేవులపల్లి గ్రామానికి చెందిన ఉయ్యాల విజయ్ అనారోగ్యంతో 10 రోజుల క్రితం మృతిచెందాడు. విజయ్ గ్రామంలోని యంగ్‌స్టార్ యూత్ క్లబ్‌లో సభ్యుడిగా ఉంటూ అన్ని కార్యక్రమాల్లో భాగస్వామి అయ్యేవాడు. కాగా మిత్రుడి మృతితో ఆ కుటుంబానికి అండగా ఉండాలని యూత్ సభ్యులు భావించారు ఈ మేరకు శుక్రవారం 50 వేల రూపాయలను విజయ్ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఫయాజ్, దాసరి సురేష్, హరీష్, బయ్య మల్లేష్, శ్రావణ్, ఇరుగు మధు, అబ్బాస్, జయంత్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.